సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 8 । జూన్ । 2025



మావోలపై పోలీసుల పైచేయి!
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మావోయిస్టు పార్టీలో రిక్రూట్‌మెంట్ ఆపేందుకు పోలీసులు చేసిన కృషి ఫలించింది. అడెల్లు ఎన్‌కౌంటర్‌తో ఉద్యమానికి ఎదురుదెబ్బ తగిలింది. 10లో▸



నేడు మృగశిర కార్తె 10లో▸
మృగశిర కార్తె ఆరంభం రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతుంటారు. ప్రధానంగా ఉబ్బసం, ఆయాసం ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొంటున్నారు.

గరిష్టం/కనిష్టం
39.5 /29.5

వాతావరణం
ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత కూడా పెరుగుతుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది.

చివరకు వివేక్‌కే..?

- ఎట్టకేలకు ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి..
- చెన్నూర్ ఎమ్మెల్యేకు కేబినెట్‌లో చోటు
- ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్‌ను పక్కన బెట్టిన అధిష్టానం
- నేడే ప్రమాణ స్వీకారం..



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి జిల్లాకు ఎట్టకేలకు మంత్రి పదవి దక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటింది. మంత్రి పదవి కోసం మొదటి నుంచి కొనసాగుతున్న పీటముడి వీడింది. ఉమ్మడి జిల్లాకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. గతేడాదిన్నరగా తర్జనభర్జనలు కొనసాగగా కేబినెట్ విస్తరణకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మాల సామాజికవర్గం నుంచి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, మాదిగ సామాజిక వర్గం కోటాలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరికి కేబినెట్ బెర్త్ ఖరారు అయినట్లు తెలిసింది.

ముగ్గురి మధ్య పోటీ..
జిల్లా నుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పోటీ పడ్డారు. గాంధీభవన్ నుంచి ఢిల్లీ వరకు పీసీసీ స్థాయి నుంచి ఏఐసీసీ అధిష్టానం దాకా ముగ్గురూ ఎవరి స్థాయిలో వారు లాబీయింగ్ చేసుకున్నారు. చివరకు అధిష్టానం వివేక్‌నే ఖరారు చేసింది. దీంతో ప్రేమ్‌సాగర్, వినోద్ కంగుతిన్నారు. అనుచరులు సైతం ఊహించని షాక్‌కు గురయ్యారు. కొద్ది రోజులుగా తమ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఖాయమన్న నమ్మకంతో ఉన్నారు. వివేక్‌కు పదవి రావడం వారికి మింగుడు పడటం లేదు. మరోవైపు చెన్నూర్ ఎమ్మెల్యే వర్గీయులు మాత్రం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వివేక్ రాజకీయ ప్రస్థానం
కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకటస్వామి తనయుడైన వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీగా రాజకీయ జీవితం ప్రారంభించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలో పనిచేసి, తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఎట్టకేలకు మంత్రి పదవి సాధించారు. ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిణామాలు ఒక దశలో ఆయనకు పదవి వస్తుందా, రాదా? అనే ఊహాగానాలు వచ్చాయి. అధిష్టానం తొలి విడతలోనే పదవీ ఇస్తున్నట్లుగా ఒకింత ప్రచారం జరిగినా సమీకరణల నేపథ్యంలో సాధ్యం కాలేదు. గతంలో పదవి రాకపోయినా, సామాజిక సమీకరణలు, రాజకీయ పట్టుదలతో అధిష్టానం ఆమోదం పొంది, తన పంతం నెగ్గించుకున్నారు. మరో వైపు జిల్లా నుంచే తన సోదరుడు వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రయత్నాలు చేశారు. అయితే సామాజిక, రాజకీయ పలు కోణాలను లెక్కలోకి తీసుకుని అధిష్టానం వివేక్ పేరు ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

మూడో వ్యక్తి..
చెన్నూర్ నుంచి గెలిచిన వారిని మంత్రి పదవులు వరిస్తున్నాయి. గతంలో బోడ జనార్దన్, గడ్డం వినోద్ మంత్రులుగా పనిచేశారు. తాజాగా గడ్డం వివేక్ వెంకటస్వామికి ఛాన్స్ దక్కింది. 1999 నుంచి 2004 వరకు అప్పటి ఎమ్మెల్యే బోడ జనార్దన్ చంద్రబాబు ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. తర్వాత 2004 నుంచి 2009 వరకు ప్రస్తుత బెల్లంపల్లి, ఎమ్మెల్యే నాటి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వైఎస్.రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా వివేక్‌కు కూడా కేబినెట్ బెర్త్ ఖరారైంది. దీంతో చెన్నూర్‌ను మూడోసారి మంత్రి పదవి వరించనుంది.

న్యూస్‌రీల్

గూడెంలో భక్తుల రద్దీ



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు..

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణాలు సందడిగా కనిపించాయి.

ముగిసిన వేసవి శిబిరం



జన్నారం అడవిలో విద్యార్థులు

జన్నారం: వేసవిలో ఇషికా ట్రెనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరం శనివారంతో ముగిసింది. విద్యార్థులను నిర్వాహకులు శనివారం జన్నారం రేంజ్ పరిధిలోని అడవుల్లోకి తీసుకెళ్లారు. హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ కన్వీనర్ వెంకట్ వీరికి అడవి విశేషాలపై అవగాహన కల్పించారు. చెట్లు, పక్షుల రకాలు, ప్రత్యేకతలు తెలిపారు. అటవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోస్టర్ విధానం అమలు చేయాలి

- ఎస్టీ చీఫ్ లైజన్ అధికారి కృష్ణయ్య



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణిలో పని చేస్తున్న ఎస్టీ ఉద్యోగులకు ఖాళీల భర్తీ, పదోన్నతుల కోసం రోస్టర్ విధానం అమలు చేయాలని సింగరేణి ఎస్టీ చీఫ్ లైజన్ అధికారి కృష్ణయ్య తెలిపారు. రోస్టర్ వెరిఫికేషన్ కార్పొరేట్ కమిటీ శ్రీరాంపూర్ ఏరియాలో శనివారం పర్యటించింది. జీఎం కార్యాలయంలో జీఎం ఎం శ్రీనివాస్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. రోస్టర్ రిజిస్టర్‌ను పగడ్బందీగా నమోదు చే యాలని సూచించారు. కొన్ని పాయింట్స్‌కి సంబంధించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రావు, జనరల్ సెక్రెటరీ నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పంతుల, ఏరియా ఎస్టీ లైజన్ అధికారి గుండేరావు, ఉపాధ్యక్షుడు మోహన్, నాయకులు హుస్సేన్‌నాయక్, రాజు నాయక్, డీవైపీఎం రాజేశ్వర్‌రావుపాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



మంచిర్యాలలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు

మంచిర్యాలఅర్బన్: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను జిల్లాలో ముస్లింలందరూ భక్తి శ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. మంచిర్యాల బస్టాండ్ సమీపంలోని ఈద్గా, క్వారీ రోడ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు బక్రీద్ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతోపాటు పలువురు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



ఆలింగనం చేసుకుంటున్న ముస్లిం చిన్నారులు

రోడ్డు పనులను అడ్డుకున్న అటవీ అధికారులు



పోడు భూముల కోసం రేంజర్‌తో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

తాండూర్: మండలంలోని నర్సాపూర్ గ్రామ పంచా యతీలోని బెజ్జాల గ్రామానికి నూతనంగా నిర్మించే బీటీ రోడ్డు పనులను అటవీ శాఖ బెల్లంపల్లి రేంజర్ పూర్ణచందర్ స్థానిక సిబ్బందితో కలిసి శనివారం అడ్డుకున్నారు. దీంతో గిరిజనులు అటవీ శాఖ అధి కారులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న సీఐ కుమారస్వామి, ఎస్సై సౌజన్య కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. బీటీ రోడ్డు చేపట్టిన భూమి అటవీ శాఖ పరిధిలోకి వస్తుందంటూ ఆ శాఖ అధికారులు పేర్కొంటుండగా, సదరు భూమికి సంబంధించి తమకు రెవెన్యూ పట్టాలు అటవీ హక్కు పత్రాలు ఉన్నాయని గిరిజనులు పేర్కొంటున్నారు. పోలీసులు, నాయకులు కలగజేసుకుని ఇరు వర్గాలతో మాట్లాడారు. అటవీ శాఖ అనుమతులు తీసుకుని పనులు చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే వినోద్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని, రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టేలా చేస్తామని స్థానిక నాయకులు హామీ ఇచ్చారు. అంతకుముందు పోచంపల్లి గ్రామంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న వారిని అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. వారం క్రితం ఎమ్మెల్యే వినోద్ ఉన్నతాధికారులతో మాట్లాడారని ఈ విషయంలో అటవీ శాఖ అధికారులు రైతులను ఇబ్బందులు పెట్టవద్దని నాయకులు కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి, నాయకులు సూరం దామోదర్‌రెడ్డి, కాపర్తి సుభాష్, బానేష్, పర్వత రావు, అమృతరావు, మాణిక్‌రావు, భగవంతురావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: తెలంగాణ వైద్య విధానపరిషత్, జిల్లా ప్రధాన పర్యవేక్షణ అధికారి పరిధిలోని లక్సెట్టిపేట సామాజిక ఆస్పత్రిలో మెడికల్ ఎక్విప్‌మెంట్ సమకూర్చేందుకు డీపీసీఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకులు డాక్టర్ ఎం.కోటేశ్వర్ తెలిపారు. వివరాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో https://mancherial.telangana.gov.in పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల ఏజెన్సీల ప్రతినిధులు ఈనెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా ప్రధాన ఆస్పత్రుల పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

యోగాసన జడ్జి శిక్షణ పొందిన రోహిత్



శిక్షణ పూర్తి చేసుకున్న రేవెల్లి రోహిత్

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన రేవెల్లి రోహిత్ పంజాబ్‌లోని పటియాలలో జరిగిన 5వ జాతీయస్థాయి యోగాసన జడ్జెస్ శిక్షణ పూర్తి చేసుకున్నట్లు జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మండ శ్రీనివాస్, అక్కల తిరుపతివర్మ తెలిపారు. నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో నిర్వహించిన శిక్షణను రోహిత్ పూర్తి చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

సాగులో అనుమానాలా..!?



కోట శివకృష్ణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త

బెల్లంపల్లి: రైతులు సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను వ్యవసాయ శాస్త్రవేత్త దృష్టికి తీసుకువెళ్లి నివృత్తి చేసుకోవడానికి 'సాక్షి' ముందుకు వచ్చింది. సోమవారం ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. వర్షాధారంగా పత్తి, వరి, కంది, పెసర, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేయడానికి సిద్ధమవుతున్న రైతులు నూతన సాగు పద్ధతులు, నూతన వంగడాలు, అధిక దిగుబడి సాధించే తీరు, చీడ పీడల నివారణ, పంటల మార్పిడితో కలిగే ప్రయోజనాల పై అనుమానాలు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రో గ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవచ్చు.

సమయం : సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
సెల్‌ఫోన్ నంబర్: **83338 18267**

మురిపించి.. ముఖం చాటేసి

- భగ్గుమంటున్న భానుడు
- రుతుపవనాలు వచ్చినా.. జాడలేని వాన
- వర్షాల అనిశ్చితితో రైతుల్లో ఆందోళన
- మిరుగుపైనే అన్నదాత ఆశలు..



గత నెలలో కురిసిన వర్షాలకు విత్తనాలు వేసేందుకు సిద్ధం చేస్తున్న రైతు

మంచిర్యాలఅగ్రికల్చర్: మే నెలలో కురిసిన ముందస్తు వర్షాలు రైతుల్లో ఆశలు రేకెత్తించాయి. మిరుగు కార్తెలో విత్తనాలు వేసేందుకు చేలను సిద్ధం చేసుకున్న రైతులు, వారం రోజులుగా వర్షాలు లేక పోవడం, ఎండలు మండిపోవడంతో నిరాశ నెలకొంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ముందస్తుగా వస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసినప్పటికీ, ఈ నెలలో చిరుజల్లులకే పరిమితమవుతుండడం రైతులను కలవరపెడుతోంది.

ముందస్తు వర్షాలతో ఆశలు
గత నెల 23 నుంచి 30 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో జిల్లాలో సగటున 94 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలతో వాతావరణం చల్లబడడంతో రైతులు పొలంబాట పట్టారు. గత ఖరీఫ్, యాసంగి పంటల మొదళ్లను ఏరివేసి, దుక్కులు సిద్ధం చేసుకున్నారు. మిరుగు కార్తె నుంచి ఖరీఫ్ సాగు పనులు ముమ్మరం చేయడానికి సన్నద్ధమయ్యారు. అయితే, ఈ నెలలో వాతావరణం ఒక్కసారిగా మారడంతో ఉదయం ఎండలు మండిపోతుండగా, సాయంత్రం మబ్బులు కమ్మినా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షాలు ఆలస్యం..
జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. రుతుపవనాల రాకతో తొలకరి వర్షాలు కురిస్తే పంట విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో పత్తి, వరి పంటలు ప్రధానంగా సాగవుతాయి. సాధారణంగా జూన్ చివరి నుంచి జులై చివరి వరకు పత్తి విత్తనాలు వేయగా, జులైలో వరి నారు పోసి, ఆగస్టు చివరి వరకు నాట్లు వేస్తారు. అయితే, గతంలో వర్షాలు ఆలస్యం కావడంతో పంట దిగుబడులు ఆలస్యమై, యాసంగి సీజన్ కూడా వెనుకబడి, ఆకాల వర్షాలతో నష్టాలు చవిచూశారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలతో జూన్‌లోనే పత్తి విత్తనాలు, జులై చివరి నాటికి వరి నాట్లు పూర్తి చేయాలని రైతులు ఆశించారు. కానీ, వర్షాలు ఆగిపోవడంతో ఈ ఆశలు నిరాశగా మారాయి.

మిరుగుపై ఆశలు..
మిరుగు కార్తె ఆదివారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ సమయంలో రైతులు సాగు పనులను ముమ్మరం చేస్తారు. అయితే, ఈ నెలలో వర్షాలు చిరుజల్లులకే పరిమితమవడంతో, వాగులు, వంకలు పొంగి ప్రవహించే పరిస్థితి లేదు. రెండు లేదా మూడు భారీ వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ కార్తె నుంచి విత్తనాలు వేసే అవకాశం ఉంటుందని ఆశిస్తున్నారు. మరో వారం వర్షాలు లేకపోతే, ముందస్తు సాగు సాధ్యం కాక, గత సంవత్సరం లాగానే పంటలు ఆలస్యమవుతాయని రైతులు పేర్కొంటున్నారు.

ఆరు రోజుల్లో నమోదైన కనిష్ట గరిష్ట ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్టం	గరిష్టం
2	28.4	36.3
3	29.0	37.4
4	28.6	38.2
5	28.2	38.6
6	28.0	37.8
7	29.2	39.4

వానలు లేవు..
పోయిన నెల వారం రోజులు భారీ వర్షాలు పడ్డయ్. దుక్కులు దు న్ని చేలను సిద్ధం చేసుకున్నం. వారం రోజుల నుంచి వానలు లేవు, ఎండలు దంచికొడుతన్నయ్. ఒకటి రెండు భారీ వర్షాలు పడితే భూమిలో నీళ్లు నిలుస్తయ్. పదన ఉంటది. అప్పుడే పత్తి విత్తనాలు వేసుకుందామని చూస్తాన్నం.
– భీమరాజుల పవన్, నెన్నెల

ఐదు రోజులు తెలికపాటి వర్షాలే..
హైదరాబాద్ వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు జూన్ 7 నుంచి 11 వరకు తేలికపాటి వర్షాలే కురిసే అవకాశం ఉంది. కనిష్ట ఉష్ణోగ్రత 28 నుంచి 30 డిగ్రీలు, పగటి ఉష్ణోగ్రతలు 39 నుంచి 40 డిగ్రీలు నమోదవుతాయి. గాలిలో తేమ ఉదయం 50 నుంచి 70 శాతం, మధ్యాహ్నం 25 నుంచి 30 శాతం ఉంటుంది. ఒకటి రెండు భారీ వర్షాలు కురిసి భూమిలో తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేసుకోవాలి.
– శివకృష్ణ ప్రోగ్రాం కోఆర్డినేటర్, కేవీకే బెల్లంపల్లి

లంచావతారులు..

- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని తీరు..
- పెరిగిన అవినీతి నిరోధక శాఖ దాడులు
- వాయిస్ రికార్డ్, ఫోన్ పే రిసిప్ట్‌లు ఉన్నా ఊచలు లెక్కపెట్టాల్సిందే
- తాజాగా మంచిర్యాల డిప్యూటీ తహసీల్దార్ మంజుల, చైన్‌మెన్ ఉదయ్ అరెస్ట్



ఇటీవల ఏసీబీకి చిక్కిన ల్యాండ్ సర్వేయర్ మంజుల, చైన్ మెన్ ఉదయ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)ని ఏర్పాటు చేసినా అధికారుల తీరు మారడం లేదు. జిల్లాస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు లంచం లేనిదే పనులు జరగని దుస్థితి నెలకొంది. ఏసీబీ అధికారులు విస్తృతంగా దాడులు చేస్తున్నా కొందరు అధికారులు డబ్బు కోసం అడ్డదారులు తొక్కుతూ ప్రభుత్వ శాఖలకు అప్రతిష్ట తెస్తున్నారు.

రాజకీయ ముద్రతో అవినీతి
ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ ప్రభావం సర్వసాధారణంగా మారింది. అధికారంలో ఉన్న నాయకులు తమకు అనుకూలమైన అధికారులకు కావాలిన్న పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నారు. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ శాఖల్లో అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్‌ల కోసం అధికారులు లక్షల రూపాయలు చెల్లించి, నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఈ పెట్టుబడిని రాబట్టేందుకు అధికారులు లంచం రూపంలో అక్రమాలకు పాల్పడుతున్నారు. కొందరు అధికారులు పనికి రేటు నిర్ణయించి, డబ్బు చెల్లించకపోతే పని చేయకుండా బహిరంగంగా చెప్పేస్తున్నారు.

ఏసీబీ దూకుడు..
స్మార్ట్‌ఫోన్‌లు, సామాజిక మాధ్యమాలు, ఏసీబీ అధికారుల సమాచారం సులభంగా అందుబాటులోకి రావడంతో లంచం డిమాండ్‌చేసే అధికారులు సులభంగా ఏసీబీకి చిక్కుతున్నారు. ప్రజలు ఇప్పుడు అవినీతి అధికారులపై ఫిర్యాదు చేయడానికి ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఫోన్‌పే వంటి డిజిటల్ చెల్లింపుల ద్వారా లంచం తీసుకునే అధికారులు కూడా ఏసీబీకి చిక్కడం వల్ల ప్రభుత్వ శాఖల పరువు దిగజారుతోంది.

పర్యవేక్షణ పెరిగినా..
జిల్లాల విభజన తర్వాత ఏసీబీ పర్యవేక్షణ పెరిగింది. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఒకే ఏసీబీ కార్యాలయం ఉండగా, ప్రస్తుతం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు మంచిర్యాలలో ఒక కార్యాలయం ఏర్పాటైంది. దీంతో ఫిర్యాదులపై వెంటనే స్పందించే అవకాశం పెరిగింది. ఈ నెల 4న మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ సర్వేయర్ పోలం మంజుల, చైన్‌మెన్ ఉదయ్‌కుమార్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. అలాగే, ఏప్రిల్ 18న సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ ఒక కేసులో లంచం డిమాండ్ చేసి ఏసీబీకి దొరికాడు. గతంలో జిల్లా కేంద్రంలో సీఐగా పనిచేసిన ఓ అధికారి ఏసీబీ రైడ్‌ను ముందే పసిగట్టి తప్పించుకున్నాడు. ఈ సంఘటనలు అవినీతి అధికారుల తీరు మారడం లేదని సూచిస్తున్నాయి.

భూ వివాదాల్లో అవినీతి
జిల్లా వ్యాప్తంగా భూముల ధరలు పెరగడంతో భూ వివాదాలు కూడా పెరిగాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు ఈ వివాదాలను తమకు అనుకూలంగా మార్చుకుని డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు, రాజీవ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఒక వ్యక్తి లక్ష రూపాయలకు కొనుగోలు చేసిన ప్లాట్‌పై మరో వ్యక్తి దొంగ పట్టా సృష్టించి వివాదం సృష్టించాడు. ఈ విషయంలో స్థానిక సీఐ, రెవెన్యూ అధికారులు అక్రమ లాభాల కోసం సహకరించినట్లు ఆరోపణలు వచ్చాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత మూడేళ్లలో నమోదైన కేసులు...

సంవత్సరం	కేసులు
2022	06
2023	09
2024	12
2025 మే వరకు	08

ఇటీవలి ఏసీబీ కేసులు

- ఏప్రిల్ 18న సీసీసీ నస్పూర్. ఎస్‌హెచ్‌వో సుగుణాకర్ క్షుద్రపూజల పేరుతో రూ.2 లక్షలు జప్తు చేసిన డబ్బును బాధితునికి తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేశాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో సుగుణాకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.
- జూన్ 4, మంచిర్యాల డిప్యూటీ సర్వేయర్ మంజుల, చైన్‌మెన్ ఉదయ్‌కుమార్ ఒక వ్యవసాయ భూమి సర్వే కోసం రూ.16,500 ఫోన్‌పే ద్వారా, రూ.10 వేల నగదు తీసుకున్నారు. అయినప్పటికీ మరో రూ.50 వేలు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫోన్‌పే రసీదులు, ఫోన్ సంభాషణల ఆధారంగా వీరిని అరెస్ట్ చేశారు.
- ఏసీబీ చర్యలు, పర్యవేక్షణ పెరిగినప్పటికీ, అవినీతి అధికారుల తీరు మారడం లేదు. ప్రజలు ఏసీబీని ఆశ్రయించడం ద్వారా అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అయితే, అవినీతిని పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చట్టాలు, కట్టుదిట్టమైన అమలు, పారదర్శక విధానాలు అవసరం.

లంచం ఇవ్వకండి.. సమాచారం ఇవ్వండి



ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఇవ్వకండి.. ఏసీబీకి సమాచారం ఇవ్వండి. లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరమే అవినీతి రహిత సమాజం కోసం ప్రతీ పౌరుడు తమవంతుగా కృషి చేయాలి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న అధికారుల వివరాలు సైతం ఇవ్వండి. ఏసీబీ అధికారులకు నిర్భయంగా నేరుగా ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1064, మొబైల్ నంబర్ 9154388963 కు ఫిర్యాదు చేయండి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.
– విజయ్‌కుమార్, ఏసీబీ డీఎస్పీ, మంచిర్యాల

క్లుప్తంగా

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిర్మల్‌రూరల్ మండలం మంజులాపూర్‌లో శనివారం ఐదేళ్ల చిన్నారి తనుశ్రీ ఆడుకుంటూ.. తప్పిపోయి రోడ్డుపైకి వెళ్లింది. ఆ చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌లో సంప్రదించారు. వెంటనే స్పందించిన పోలీసులు రోడ్డుపై ఉన్న చిన్నారిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు.

గుడుంబా పట్టివేత

మందమర్రిరూరల్: పట్టణంలోని కేకే–5 ఫిల్లర్‌బెడ్ ఏరియాలోని గుడుంబా విక్రయిస్తున్న మహిళను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. పక్కా సమాచారంతో అక్కడకు వెళ్లి బానోతు కమల ఇంటి పరిసరాల్లో సోదాలు చేయగా ఆరు లీటర్ల గుడుంబా లభ్యమైంది. వెంటనే స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాసరలో మకాం.. నిజామాబాద్‌లో చోరీలు

- ముగ్గురి అరెస్ట్.. పరారీలో ఒకరు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు, నగదు

ఖలీల్‌వాడి: బాసరలో ఇల్లు అద్దెకు తీసుకుని నిజామాబాద్‌లో చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని చిలుకలవాడకు చెందిన షేక్ యామీన్ అలియాస్ సమీర్ అలియాస్ గోపి (40), ఆదిలాబాద్ జిల్లా తాటిగూడ రైల్వేస్టేషన్‌కు చెందిన సయ్యద్ ఫరూక్ (22), మహారాష్ట్రకు చెందిన సత్య నిర్మల్ జిల్లా బాసరలో ఇంటిని అద్దెకు తీసుకుని నిజామాబాద్ జిల్లాలో చోరీలకు పాల్పడుతున్నారు. యామీన్, సయ్యద్ ఫరూక్ 20 పైగా కేసుల్లో జైలుకి వెళ్లి వచ్చారు. శనివారం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో పార్క్ చేసిన బైక్‌ను దొంగతనం చేసి, అదేబైక్‌పై చోరీ కోసం వెళ్తుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. నిందితులు ఎడపల్లి పీఎస్ పరిధిలోని ఓ ఇంటితోపాటు పాన్ షాప్‌లో, నగరంలోని మూడో టౌన్ పీఎస్ పరిధిలోని తాళం వేసి ఉన్న ఇంట్లో, జక్రాన్‌పల్లి పీఎస్ పరిధిలోని బెల్ట్‌షాప్‌లో, రైళ్లలో తిరుగుతూ సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల్లో సత్య పరారీలో ఉండగా, పట్టుబడ్డ నిందితుల నుంచి రూ.5 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక టీవీ, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిందితుల నుంచి దొంగసొత్తును కొన్న హైదరాబాద్‌లోని కొంపెల్లికి చెందిన అరవింద్ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

మావోలపై పోలీసుల పైచేయి!

- అడెల్లు ఎన్‌కౌంటర్ ఉద్యమానికి ఎదురుదెబ్బ
- పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మావోయిస్టు..
- మళ్లీ రిక్రూట్‌మెంట్ జరుగుతుందనే భయం

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మావోయిస్టు రిక్రూట్‌మెంట్‌ను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం చేస్తున్న కృషి ఫలిస్తోంది. నాలుగేళ్ల క్రితం మావోయిస్టు అగ్రనేతలు మైలారపు అడెల్లు, బండి ప్రకాశ్ రిక్రూట్‌మెంట్ కార్యకలాపాలపై దృష్టి సారించిన పోలీసులు, అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ఇటీవల అడెల్లు హతమవడంతో జిల్లాలో మావోయిస్టు రిక్రూట్‌మెంట్ భయం గణనీయంగా తగ్గింది.

నాలుగేళ్ల క్రితం వ్యూహం..

నాలుగేళ్ల క్రితం, కరోనా కాలంలో మావోయిస్టు నేతలు అడెల్లు, బండి ప్రకాశ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రిక్రూట్‌మెంట్ కోసం సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డి వారం రోజుల పాటు జిల్లాలో మకాం వేశారు. స్థానిక పోలీసు అధికారులతో రోజువారీ సమీక్షలు నిర్వహిస్తూ, గ్రేహౌండ్స్, ఇతర బలగాలతో అడవుల్లో విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, అప్పట్లో ఈ ఇద్దరు నేతలు తప్పించుకున్నారు. ఇప్పుడు అడెల్లు హతమవడంతో ఈ జిల్లాపై మావోయిస్టు పట్టు బలహీనపడింది.

ఒకప్పటి ఉద్యమ పరిస్థితి

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో మావోయిస్టు దళాలు నిత్యం సంచరించేవి. ఒక్కో దళంలో 20 మంది వరకు సభ్యులు ఉండేవారు. కొత్త రిక్రూట్‌మెంట్లు, ప్రజావ్యతిరేక విధానాలను హెచ్చరిస్తూ లేఖలు, రాజకీయనేతలపై దాడులు, విధ్వంసాలు, హత్యలు సర్వసాధారణంగా జరిగేవి. అయితే, గత రెండు దశాబ్దాలుగా జిల్లాలో మావోయిస్టు ప్రభావం గణనీయంగా తగ్గింది. ఉమ్మడి జిల్లా నుంచి సెంట్రల్ కమిటీలో కీలకంగా ఉన్న నేతలు ఇప్పటికీ రిక్రూట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, అడెల్లు మరణంతో వారి కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

కూంబింగ్, కాల్పులతో దద్దరిల్లిన అడవులు

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో పోలీసు కూంబింగ్, మావోయిస్టులతో ఎదురుకాల్పులు, ఎన్‌కౌంటర్‌లు, పోలీసులకు గాయాలు, మరణాలు సాధారణ ఘటనలుగా ఉండేవి. కడెం మండలం అల్లంపల్లిలో జరిగిన ఎదురుకాల్పుల్లో పోలీసుల మరణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మావోయిస్టు సానుభూతిపరుల అరెస్టులు, ఇన్‌ఫార్మర్ల హత్యలు కూడా ఈ జిల్లాలో తరచూ జరిగేవి. అయితే, ఇప్పుడు ఈ పరిస్థితి గణనీయంగా మారి, అడవుల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.

ఒకప్పుడు దళాలు, ఇప్పుడు నిశ్శబ్దం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఖానాపూర్–సింగాపూర్, మంగీ, కాగజ్‌నగర్, బోథ్, చెన్నూర్, ఇంద్రవెల్లి, సిర్పూర్ దళాలు మావోయిస్టు కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేవి. కోల్‌బెల్ట్ ఏరియాలో సికాసా, జిల్లా స్పెషల్ గెరిల్లా స్క్వాడ్, మిలిటరీ ప్లాటూన్లు మెరుపుదాడులకు పాల్పడేవి. అయితే, ప్రస్తుతం ఈ దళాల ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. బోథ్, బజార్‌హత్నూర్, ఖానాపూర్, సిర్పూర్, చెన్నూర్, జన్నారం, బెల్లంపల్లి అడవుల్లో ఒకప్పుడు కాల్పులతో దద్దరిల్లిన వాతావరణం ఇప్పుడు నిశ్శబ్దంగా మారింది.



మావోయిస్టులకు చెందిన పోస్టర్

మావోయిస్టుల తగ్గుదల

రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 50 మందికి పైగా మావోయిస్టులు చురుకుగా ఉండగా, ఆ సంఖ్య క్రమంగా 20కి చేరింది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత, బోథ్ మండలం పొచ్చెరకు చెందిన సెంట్రల్ కమిటీ సభ్యుడు అడెల్లు మరణం, ఇటీవల జిల్లాకు చెందిన ఒకరిద్దరు మహిళా మావోయిస్టుల మరణంతో జిల్లాలో వారి ఉనికి దాదాపు కనుమరుగైంది.

నేషనల్ పార్క్‌లోనే బండి ప్రకాశ్!

బీజాపూర్ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మందమర్రికి చెందిన మరో మావోయిస్టు నేత బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్, రమాకాంత్, క్రాంతితోపాటు మరో కొంత మంది మూడు రోజులుగా పోలీసు బలగాల అదుపులో ఉన్నారని పౌరహక్కుల నేతలు ఆరోపిస్తున్నారు. పోలీసు బలగాలు ఎన్‌కౌంటర్ చేసే ప్రమాదం ఉందని, వారిని కోర్టులో హాజరుపర్చాలని పౌరహక్కుల నేతలు ఓ ప్రకటన విడుదల చేయడంతో ఈవిషయం మందమర్రిలో చర్చనీయాంశమైంది.

అడెల్లుకు మామిడిగట్టుతో అనుబంధం

- 30 ఏళ్ల క్రితమే మామిడిగట్టులో చిక్కాడు

మందమర్రిరూరల్: ఛత్తీస్‌గఢ్ జిల్లా బీజాపూర్‌లో గల నేషనల్ పార్క్ అడవుల్లో ఈనెల 6న ఎన్‌కౌంటర్‌లో జరిగిన మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని మామిడిగట్టు గ్రామంతో ఆయనకు అనుబంధం ఉంది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర గ్రామానికి చెందిన ఆయన చెన్నూర్ దళంలో చాలాకాలం పనిచేశారు. 1996 ప్రాంతంలో మందమర్రి మండలం మామిడిగట్టులో గల ఓ ఇంటిలో షల్టర్ తీసుకోగా పోలీసులకు సమాచారం అందింది. అప్పుడు పోలీసులు ఆ ఇంటిని చుట్టుముట్టి అడెల్లును అదుపులో తీసుకున్నారు. ఎలాంటి అరెస్ట్ చూయించకుండా ఎన్‌కౌంటర్ చేయడానికి రంగం సిద్ధం చేసుకోవడంతో ఆ షెల్టర్ ఇచ్చిన ఆ యజమాని విలేకరులకు విషయాన్ని తెలియజేయడంతో ఆ వార్తను కవరేజ్ చేయడంతో ఎన్‌కౌంటర్ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. లేకపోతే 30 ఏళ్ల క్రితమే అడెల్లు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందేవాడు. తర్వాత అడెల్లు జిల్లా కార్యదర్శిగా ఇన్‌చార్జిగా ఆలా ఏళ్లుగా బాధ్యతలు నిర్వహించారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయే నాటికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహించాడు. అడెల్లును మావోయిస్ట్ పార్టీలోకి తీసుకువచ్చిన నిర్మల్ జిల్లాకు చెందిన సుధాకర్ (సత్వాజీ) లొంగిపోయినప్పటికీ అడెల్లు మాత్రం పార్టీ సిద్ధాంతాలను నమ్మి చివరివరకు ఉద్యమంలో కొనసాగారు.

బీజాపూర్‌కు కుటుంబీకులు

బోథ్: మైలారపు అడెల్లు.. అడవి బాటపట్టి పేద ప్రజల కోసం పనిచేస్తే చంపేస్తారా? కుటుంబాన్ని వదిలి మాకు 30 ఏళ్లు దూరమయ్యాడు. కనీసం ఆయన మృతదేహాన్ని అప్పగించండి.. కడసారి చూడాలని ఉందని కుటుంబీకులు, బంధువులు రోదిస్తున్నారు. ఆయన మృతదేహం అప్పగించాలని కోరుతూ అన్న మైలారపు సీతారాం సహా ఎనిమిది మంది బీజాపూర్‌కు వెళ్లారు. శనివారం హెలికాప్టర్‌లో తీసుకుచ్చిన ఆరుగురు మావోల మృతదేహాల్లో అడెల్లుని గుర్తించారు. పోస్టుమార్టం తర్వాత అప్పగింతపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని పోలీసులు తెలిపారు.



ఇంటివద్ద రోదిస్తున్న కుటుంబీకులు

బాబాయి మృతదేహం అప్పగించండి



మా బాబాయి అడెల్లు మృతదేహాన్ని అప్పగించండి. ఏ తప్పు చేశారని చంపేశారు. తెలంగాణ బిడ్డ ప్రజల కోసమే పోరాడాడు. కుటుంబాన్ని వదిలి మూడు దశాబ్దాలు గడిచింది. ఆయన ప్రజల కోసమే తన జీవితాన్ని వదులుకున్నాడు. ఆయన కుటుంబీకులు అందరూ పేదవారే. కడసారి చూపునకు మృతదేహాన్ని అప్పగించాలి.

– గీత, అడెల్లు అన్న కూతురు

సీవోఈ విద్యార్థుల ప్రభంజనం



దాగం శోభిత్ డి.సిద్దార్థ బి.ఉషాకిరణ్ ఎస్.రుషికేష్ పున్నంచందర్ కార్తీక్

- ఐఐటీ ఫౌండేషన్ ప్రవేశపరీక్షలో ప్రతిభ
- ఫలితాల్లో 15 మంది ఎంపిక

బెల్లంపల్లి: ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, నీట్, క్లాట్, యూపీఎస్సీ తదితర ఫౌండేషన్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షల్లో బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. శనివారం గురుకుల విద్యాలయ సంస్థ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడించింది. సీవోఈ విద్యార్థులు అత్యధికంగా 15 మంది ఎంపికై రికార్డు సృష్టించారని ప్రిన్సిపాల్ ఆకిడి విజయ్‌సాగర్ ప్రకటించారు. ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎంపిక చేసిన గురుకులాల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం 2025–26లో 8వ తరగతిలో ప్రవేశం కల్పించి ఐఐటీ, నీట్, క్లాట్, యూపీఎస్సీ వంటి ప్రతిష్టాత్మక కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రతిభావంతంగా తీర్చిదిద్దుతారు. గత ఏప్రిల్ 21 ప్రవేశపరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 7వ తరగతి చదువుతున్న గురుకుల విద్యార్థులను ఎస్ఏ–1లో వచ్చిన మార్కుల ప్రాతిపదిక స్క్రీనింగ్ టెస్ట్‌కు ఎంపిక చేశారు. ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో పరీక్ష నిర్వహించి అందులో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయించారు.

సీటు సాధించిన విద్యార్థులు వీరే..

ఫౌండేషన్ కోర్సుల్లో విద్యార్థులకు బోధన సాగించడానికి రాష్ట్రవ్యాప్తంగా బాల,బాలికల కోసం 10 గురుకుల సీవోఈ కళాశాలలను ఎంపిక చేశారు. ఐదు సీవోఈ కళాశాలలను బాలురకు మరో ఐదు సీవోఈ కళాశాలలను బాలికలకు కేటాయించారు. దాగం శోభిత్, డి.సిద్దార్థ, బి.సాయిసృజన్ (గౌలిదొడ్డి సీవోఈ కళాశాల), కె.నవనీత్ (చిలుకూరు సీవోఈ కళాశాల), డి.ఆశ్రిత్, ఎం.శ్రావణ్, డి.హృతిక్ తేజ, కె.కార్తీక్ (ఉప్పల్ సీవోఈ కళాశాల), ఎస్.రుషికేష్, బి.ఉషాకిరణ్, డి.వరప్రసాద్, సీహెచ్.మిథున్, ఎం.పున్నంచందర్, కె.కార్తీక్, పి.విరాజ్ (ఇబ్రహీంపట్నం సీవోఈ కళాశాల) ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీపరీక్షల్లో విజయం సాధించి ఫౌండేషన్ కోర్సుకు ఎంపికైన విద్యార్థులను, ఉపాధ్యాయులు మల్టీజోనల్ అధికారి అలివేలు, సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌సాగర్ అభినందించారు.

ఖైరతాబాద్ గణేశ్ మండపంలో గజ్జలమ్మ

కుంటాల: ఖైరతాబాద్ గణేశుడు 71 ఏళ్ల వసంతాలు పురస్కరించుకుని ఈఏడాది భక్తులకు శ్రీ విశ్వశాంతి మహాగణపతిగా కొలువుదీరి భక్తులకు దర్శనం ఇవ్వనుంది. విగ్రహ నమూనాను శుక్రవారం నిర్వాహకులు విడుదల చేశారు. గణేశ్ మూడు తలలతో గంభీరంగా నిల్చుని, తలపై ఐదు సర్పాలు, ఎనిమిది చేతులతో కనిపించనుంది. గణేశ్ కుడివైపున మండపంలో శ్రీ లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామి, ఎడమవైపున కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ విగ్రహాలు కొలువుదీరనున్నాయి. 69 అడుగులు అడుగుల ఖైరతాబాద్ గణేశుడు పక్కన శ్రీ గజ్జలమ్మ విగ్రహాన్ని నెలకొల్పడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



విడుదలైన విగ్రహ నమూనా

ఎస్టీపీపీలో ఎస్టీ లైజన్ అధికారుల పర్యటన

జైపూర్: జైపూర్ ఎస్టీపీపీలో శనివారం ఎస్టీ లైజన్ అధికారుల బృందం పర్యటించింది. ఎస్టీ చీఫ్ లైజన్ ఆఫీసర్, జీఎం ఇల్లందు కృష్ణయ్యకు ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు స్వాగతం పలికారు. అనంతరం అడ్మిన్ భవన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్టీపీపీలో చేపడుతున్న నియామకాల్లో ప్రమోషన్ పాలసీలో రూల్‌ఆఫ్ రిజర్వేషన్(ఆర్‌వోఆర్) అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్టీపీపీలో ఎస్టీ ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్టీ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ పంతులా, ఎస్టీపీపీ లైజన్ ఆఫీసర్ దేవేందర్, డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం, మోహన్, చంద్రమాణి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులు వీడ్కోలు

ఎస్టీపీపీలో డీజీఎం(పర్సనల్)గా విధులు నిర్వర్తించిన అజ్మీరా తుకారాంకు అధికారులు ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఎస్టీపీపీకి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు జెన్‌సింగ్, సముద్రాల శ్రీనివాస్, మురళీధర్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న పర్సనల్ డీజీఎం తుకారాంను సన్మానిస్తున్న అధికారులు

దుబాయ్‌లో జిల్లావాసి తంటాలు

- ఇరాక్ పంపిస్తానని సబ్ ఏజెంట్ మోసం
- బాధితుడిని స్వగ్రామానికి రప్పించాలి
- ఎన్ఆర్ఐ అడ్వైజరీ బోర్డు రాష్ట్రకమిటీ సభ్యుడికి కుటుంబీకుల వినతి

నిర్మల్‌ఖిల్లా: ఇరాక్ పంపిస్తానని చెప్పి దుబాయ్‌కు పంపి సబ్ ఏజెంట్ మోసం చేయడంతో జిల్లావాసి తంటాలు పడుతున్నాడు. వివరాలు ఇలా.. జిల్లాలోని సోన్ మండలం బొప్పారం గ్రామానికి చెందిన కిష్టపురం లస్మన్న(42) గత కొన్నేళ్లుగా గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నాడు. గతేడాది స్వగ్రామానికి తిరిగివచ్చి మెరుగైన ఉపాధికోసం ఇరాక్ వెళ్లాలని గతేడాది నవంబర్‌లో గ్రామానికి చెందిన ఓ మధ్యవర్తికి రూ.2 లక్షలు ఇచ్చి వీసా కోసం ప్రయత్నించాడు. సదరు వ్యక్తి నిజామాబాద్ జిల్లా చాకిర్యాలకు చెందిన ఓ సబ్‌ఏజెంట్ ద్వారా ఇరాక్ పంపేందుకు ఏర్పాటు చేశాడు. సబ్ ఏజెంట్ దుబాయ్‌లోని పవర్ రిక్రూట్మెంట్ ఎల్.ఎల్.సీ లేబర్ సప్లై కంపెనీకి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ లేబర్ వీసా అంటగట్టి దుబాయ్ పంపాడు. ఇరాక్ పంపడానికి కొంత టైం పడుతుందని చెప్పగా చేసేదేమి లేక లస్మన్న కొన్నినెలల క్రితం దుబాయ్ వెళ్లి కార్మికుడిగా పని చేస్తున్నాడు. తక్కువ వేతనంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని కుటుంబీకులకు తెలిపాడు. భార్య లక్ష్మి సదరు సబ్ ఏజెంట్ ఇంటికి వెళ్లి నిలదీయగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడు. మీ ఇష్టం వచ్చింది చేసుకోండి అనడంతో మోసపోయామని గుర్తించిన లస్మన్న కుటుంబీకులు శనివారం నిర్మల్‌లో ఎన్ఆర్ఐ అడ్వైజరీ బోర్డు రాష్ట్ర కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లను కలిసి విన్నవించారు. భర్త లస్మన్నను స్వగ్రామానికి తీసుకురావాలని వినతిపత్రం అందజేశారు.



ఎన్ఆర్ఐ అడ్వైజరీ బోర్డు రాష్ట్ర కమిటీ సభ్యుడు స్వదేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న కుటుంబ సభ్యులు



బాసరలో భక్తుల రద్దీ

బాసర: శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చి దర్శనం కోసం బారులు తీరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు అర్చకులతో అక్షరాభ్యాసం చేయించారు. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు. కాగా, ఆలయంలో వివిధ అర్జిత సేవా టికెట్ల ద్వారా రూ.11 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1950–2025 వరకు పదో తరగతి చదివిన బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఉట్నూర్ వేదికగా పెర్కగూడ జేసీఎస్ గార్డెన్‌లో జరిగే సమ్మేళనానికి వీరంతా హాజరుకానున్నారు. వాట్సాప్ వేదికగా పూర్వ విద్యార్థులంతా అందరిని కలుపుకొని రాష్ట చరిత్రలో ఎక్కడ నిర్వహించని విధంగా ఈ సమ్మేళనం నిర్వహించనున్నారు. విద్యార్థులే కాక విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇప్పటికే సమ్మేళన ఏర్పాట్లు పూర్తిచేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యనిర్వహణ కమిటీ సభ్యులు ధరంసింగ్, రాజ్‌గోపాల్ కోరారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

రెబ్బెన: గుర్తుతెలియని పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. దండేపల్లి మండలం కొండపల్లికి చెందిన ముత్యాల వెంకటేశ్ (27) మంచిర్యాలలోని మేదరివాడలో వైన్స్ షాప్‌లో పనిచేస్తున్నాడు. 15 ఏళ్లుగా తిర్యాణిలో అమ్మమ్మ పోశక్క వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఇంటికి వచ్చి వెంకటేశ్ అప్పటికే మద్యం తాగి ఉన్నాడు. ఈక్రమంలో డబ్బుల విషయమై అమ్మమ్మతో చిన్నపాటి ఘర్షణ జరిగింది. తాగొద్దని ఎంత చెప్పినా వినకపోవడంతో అమ్మమ్మ మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆయన రెబ్బెన మండలంలోని తక్కళ్లపల్లి బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ కిందకు వచ్చి గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. ఈవిషయాన్ని బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. వారు అక్కడికి చేరుకుని అతన్ని మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

నాగోబా ఆలయ ప్రధాన పూజారి మృతి



కోసు కటోడా (ఫైల్)

నార్నూర్: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయం ప్రధాన పూజారి, గాదిగూడ మండలంలోని బొడ్డిగూడకు చెందిన మెస్రం కోసు కటోడా (70) అనారోగ్యంతో మృతిచెందారు. గత పదేళ్లుగా నాగోబా ఆలయ ప్రధాన పూజారిగా కొనసాగుతున్నారు. గత కొన్నినెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి నుంచి ఆరోగ్యం విషమించడంతో శనివారం తెల్లవారుజామున ఇంట్లో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల ఆలయ కమిటీ సభ్యులు మేస్రం శేఖర్ తదితరులు సంతాపం ప్రకటించారు.

బావిలో పడి యువకుడు..

సోన్: ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డి కథనం ప్రకారం..మండలంలోని కూచన్‌పెల్లి గ్రామానికి చెందిన ఇందూరి మణిచందర్ (21) తన చేనులో పసుపు పంట సాగు చేస్తున్నాడు. శుక్రవారం నీళ్లు పారించడానికి అక్కడికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా దొరకలేదు. రాత్రి చేను వద్దకు వెళ్లి బావి వద్ద చెప్పులు, నగదు కనిపించాయి. పోలీసులకు సమాచారం అందించారు. శనివారం బావిలో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరు..

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌లో అర్ల గంగయ్య (52) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగయ్య శనివారం ఉదయం తలకు తీవ్రగాయాలై ఆపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కుమారుడు గిరిబాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

నెన్నెల: మండలంలోని జెండావెంకటాపూర్‌లో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఆరుగురు కాంగ్రెస్ నాయకులపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..రెవెన్యూ సదస్సు జరుగుతుండగా నాయకులు రెండు వర్గాలుగా ఏర్పడి ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గొడవపడ్డారు. గోగు సుధాకర్ అతని తండ్రి గోగు లింగయ్యపై కుర్చీలతో దాడికి పాల్పడిన జనగామ తిరుపతి, బండారి రవి, బండారి మహేశ్, బోర్లకుంట వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు. వాళ్లే తమను తిట్టారని, చేతులతో కొట్టారని జనగామ తిరుపతి వర్గం చేసిన ఫిర్యాదుతో గోగు సుధాకర్, లింగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేశామన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై..

నెన్నెల: మండలంలోని నందులపల్లికి చెందిన బొర్లకుంట్ల రవి అదే గ్రామానికి చెందిన దుర్గం చంద్రయ్యపై దాడి చేసి గాయపర్చినందుకు గాను అతడిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇంటి పక్కనే ఉండే రవి హద్దులను జరపగా చంద్రయ్య ఎందుకు జరిపావని అడిగాడు. నువ్వు ఎవరని అంటూ రవి ఇష్టం వచ్చినట్లు తిడుతూ చేతులు, కర్రలతో దాడికి పాల్పడ్డాడు. ఈదాడిలో చంద్రయ్యకు గాయాలయ్యాయి. చంద్రయ్య ఫిర్యాదుతో రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కడెం ఎఫ్ఆర్వోపై..

కడెం: వరిధాన్యం బస్తాలను తరలిస్తున్న లారీలకు సెస్ వసూళ్లు చేసినందుకుగాను కడెం అటవీ రేంజ్ అధికారి గీతారాణిపై కేసు నమోదైంది. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో రాకపోకలు సాగించే వాహనాలకు ఎన్విరాల్‌మెంటల్ సెస్ పేరుతో గత కొన్నేళ్లుగా సెస్ వసూళ్లు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ధాన్యం తరలిస్తున్న లారీలకు డబ్బులు వసూలు చేసినందుకుగాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎఫ్ఆర్వోపై కేసు నమోదైనట్లు సమాచారం.

నేడు మృగశిరకార్తె

- చేపల విక్రయానికి మార్కెట్లు సిద్ధం
- రకాన్ని బట్టి డిమాండ్

నెన్నెల: మృగశిర అనగానే గుర్తుకు వచ్చేది చేపలు. ఈ కార్తె ఆరంభరోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. మృగశిర కార్తెతో వర్షాకాలం ప్రారంభమైందని అంటారు. కార్తె రోజున చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతుంటారు. ప్రధానంగా ఉబ్బసం, ఆయాసం ఉన్నవారికి ఈ చేపలు ఎంతో మంచివి. వేసవిలో ఉష్ణోగ్రతలతో శరీరంలో వేడి ఎక్కువ ఉంటుందని అది చేపలు తినడం వల్ల దూరమవుతుందనేది పెద్దల మాట. దీంతోపాటు పెరిగిన సమతుల్యం, హృదయ సంబంధిత వ్యాధుల నివారణకు చేపలు తినడం మంచిదని చెబుతారు. రోహిణి కార్తెలో వేడెక్కిన శరీరం చల్లబడేందుకు పోషక విలువలు పొందేందుకు చేపలు తినాలనేది ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలో మృగశిర రోజున చేపలకు మంచి గిరాకీ ఉంటుంది.

ఫిష్ మార్కెట్లు సిద్ధం

మృగశిర కార్తె రోజు చేపలు తినాలనే ఆనవాయితీ ఉండటంతో ఉమ్మడి జిల్లాలోని చేపల మార్కెట్లు సిద్ధం చేశారు. గ్రామాల్లో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, వాగుల్లో చేపలను పట్టి మార్కెట్లకు తరలించేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. గ్రామీణప్రాంతాల్లో వాడవాడ తిరుగుతూ వ్యాపారులు చేపలు విక్రయిస్తారు.

చేపలకు డిమాండ్

మృగశిర రోజు రెట్టింపు ధరలైనా వినియోగదారులు కొనుగోలు చేసేందుకు వెనుకాడరు. సాధారణ రోజుల కంటే చేపలకు ధరలు విపరీతంగా పెరుగుతాయి. అయినా మత్స్యప్రియులు కొనేందుకు వెనుకాడరు. బొమ్మ చేప ధర సాధారణ రోజుల్లో కిలో రూ.300 ఉండగా మిరుగు రోజు కిలో రూ.600 రెట్టింపు ధర పలుకుతోంది. రవ్వ, బొచ్చె, బంగారు తీగ, మెరుగ, ఆలుగుచేప, జెల్లెలు, పాపర్లు, గ్యాస్‌కట్ రకాల చేపలు ఉండగా వీటి ధర సాధారణ రోజుల్లో కిలో రూ.120 ఉండగా మృగశిర రోజు రూ.200 నుంచి రూ.240 వరకు విక్రయిస్తారు.



కుమ్మరివాగు ప్రాజెక్టు వద్ద విక్రయిస్తున్న చేపలు

ఆరోగ్యదాయకం ఇంగువ బెల్లం

శారీరక ఆరోగ్యం కోసం ఈ కార్తెలో శాఖాహారులు ఇంగువ, బెల్లం తింటారు. ఈ రెంటిని కలిపి చిన్న చిన్న ముద్దలు చేసి పరిగడుపున తింటారు. ఇంగువకు చలువ చేసే శక్తి, బెల్లానికి జీర్ణం చేసే శక్తి ఉంటుంది. విపరీతమైన ఎండలతో తల్లడిల్లిన జనానికి ఒక్కసారి ఋతువు మారడంతో శరీరంలో తలెత్తే రుగ్మతలు దీన్ని తినడంతో నశిస్తాయని పెద్దలు చెబుతుంటారు.

ఉచిత చేపమందు పంపిణీ

దండేపల్లి: మండల కేంద్రంలో మృగశిర కార్తెప్రవేశాన్ని పురస్కరించుకుని ఉబ్బసం వ్యాధి నివారణకు గ్రామానికి చెందిన రంగసాయి ప్రేమ్‌రాజ్–భూలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఉచిత చేప మందు పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మందు పంపిణీ కోసం నిర్వహణ కమిటీ శనివారం జీపీ కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. చేపమందు కోసం వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని చర్చించారు. వివరాలకు 9866885308, 9440707416, 9640376530, 9908401985 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.